**కథ**

# సావిత్రమ్మ తప్పిపోయింది

**ఎల్. సుకన్య**

**అప్పటికి సావిత్రమ్మ అమెరికా వచ్చి నెల దాటింది. పెళ్లయి కూతురు అమెరికా వచ్చి సంవత్సరమైంది. ఎలా ఉందో చూడాలనే ఆరాటంతో వచ్చింది. వస్తున్నప్పుడు కూతురు శిల్ప చెప్పింది ఫోన్లో "నీవు ఎంబ్రాయిడరీలు చేస్తుంటావు గదా, అలాంటివేమన్నా తెచ్చుకో. లేకపోతే మేం ఆఫీసులకు వెళ్లాక నీకేమీ తోచదు" అని. కూతురు చెప్పినట్లే వస్తూ వస్తూ మనవడికి స్వెట్టర్ అల్లడానికి ఊలు, లేసులు అల్లడానికి రంగుల దారాలు, వాటికి కావల్సిన నీడిల్స్ అన్నీ తెచ్చుకుంది.**

కూతురు, అల్లుడు ఆఫీసులకు వెళ్లిపోయాక తిరిగి వచ్చేవరకు సావిత్రమ్మ పైన తనకు కేటాయించిన బెడ్ రూంలో కిటికీ దగ్గర కూచొని, బయటకు చూస్తూ స్వెట్టర్ అల్లుకుంటూ కాలక్షేపం చేస్తోంది. ఈమధ్యనే స్వెట్టర్ అల్లడం పూర్తయి లేసుతో టేబుల్ క్లాత్ అల్లడం మొదలుపెట్టింది క్రింద డ్రాయింగ్ రూంలో ఉన్న రౌండ్ టేబుల్ మీదకు.

అసలు సావిత్రమ్మకు అమెరికా చాలా నచ్చింది. అన్నీ ఒకే రకంగా ఉన్నట్టు కనిపించే ఆ ఇళ్లవైపు అలా ఆశ్చర్యంగా చూస్తూ ఉంటుంది. అందులోను కూతురు ఇల్లు మరింత నచ్చింది. పైన మూడు బెడ్ రూంలు. కింద హాలు, డ్రాయింగ్ రూం, కిచెన్.. అన్నీ ఎక్కడికక్కడ అమర్చి ఎంత బావుందో? చెక్క ఇళ్లంట. అయితే ఏం నున్నగా, నాజుగ్గా ఉన్నాయి. కొడుక్కి పెళ్లయి ఐదేళ్లు అయింది. ఇంకా అద్దె కొంపలోనే.

ఆ వెడల్పాటి రోడ్డులను చూస్తుంటే ఆమెకు తెగ ముచ్చట. శుభ్రంగా, నల్లగా నిగనిగలాడుతుంటాయి. ఒక్క చిన్న కాగితం ముక్క కూడా ఎవ్వరూ కింద పడెయ్యరు. అందరి ఇళ్ల ముందు, ఫుట్‌పాత్ పక్కన చక్కగా పచ్చగా గడ్డి - ఫుట్‌పాత్‌ల మీదా అప్పుడప్పుడు నడిచే వాళ్లు, పరుగెత్తే వాళ్లు తప్ప జనమే ఉండరు. పొన్నూరులో అసలు ఇలా ఉండనే ఉండదు. ఎక్కడికక్కడ గుంతలు, గొయ్యిలు, మట్టి రోడ్లు, గేదెలు, పేడ, గడ్డి, కిక్కిరిసిన జనం. వర్షం పడితే ఇహ చెప్పక్కర్లేదు. ఇక్కడ ఒక్క చుక్క నీళ్లు కూడా కనిపించవు. అయినా ఆశ్చర్యం. ఒక నిమిషం ఎండ, మరో నిమిషం వాన.

ఈమధ్య సావిత్రమ్మకు ఆ రోడ్లమీద నడవాలనే కోరిక కలిగింది. అది రోజురోజుకూ పెరుగుతోంది. రోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు ఆ కుర్చీలో అలాగే కూచోవడం విసుగ్గా ఉంటోంది. పొద్దస్తమానం అల్లి అల్లి మెడ, నడుము నొప్పులు. సాయంత్రం ఎప్పుడవుతుందా, శిల్ప ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ కూచోడం కంటే కాస్త అలా నాలుగురోడ్లు తిరిగి వస్తే బావుంటుంది కదా!

అప్పుడే ఇంటి పక్కగా ఉన్న ఫుట్‌పాత్ మీద చిన్నపిల్లను పెట్టుకుని పెరోమిలేటర్ తోసుకుంటూ, రెండు కుక్కల్ని పట్టుకుని, కుక్కలు ముందు నడుస్తూంటే ఒకమ్మాయి వెనుక నడుస్తోంది గబగబా. ఆ అమ్మాయి కనిపించినంతసేపూ చూసింది సావిత్రమ్మ.

'కొంచెం ఎండ వస్తే చాలు, పిల్లల్ని, కుక్కల్ని తీసుకుని వాకింగ్ చేస్తారు. అసలు ఆ పిల్లలుగానీ, ఆ తల్లులుగానీ ఎంత తెల్లగా ఉంటారో? అంత రంగు ఎలా వస్తుందో? ఇక్కడి చలికి తెల్లబడతారా? శిల్ప కూడా తెల్లబడి చక్కగా ఉంది. కుక్కలు కూడా ఎంత బలంగా ఉంటాయి? ఏం తిండి పెడతారో ఏమిటో?

ఈ రోజు శిల్ప వచ్చాక గట్టిగా అడగాలి దోవ చూపించమని. రోజూ ఆ దోవనే వెళ్లి వస్తే సరి. ఇంకో ఇరవై రోజుల్లో పొన్నూరు వెళ్లిపోతుంది కూడా. మళ్లీ ఎప్పుడో? అమ్మాయి పురుడు పోసుకున్నప్పుడే. అదెప్పుడో మరి.

సాయంత్రం ఎప్పుడవుతుందా శిల్ప ఎప్పుడు వస్తుందా అని రోజూ కంటే ఎక్కువగా ఎదురుచూసింది సావిత్రమ్మ ఆ రోజు.

దేవుడు ఆమె కోరికను మన్నించినట్టు శిల్ప ఆ రోజు త్వరగా వచ్చింది. కిటికీలో నుండి శిల్ప కారుని చూడగానే చేతిలోని లేసుని గబగబా ఉండ చుట్టేసి కుర్చీలో నుండి లేచింది సావిత్రమ్మ.

శిల్ప గ్యారేజీలో కారు పెట్టేసి అక్కడి నుండి లోపలకు ఉన్న తలుపు తాళం తీసుకుని లోపలకు వస్తూ పై నుండి మెట్లు దిగుతున్న సావిత్రమ్మను చూసి, "అమ్మా ఏం చేస్తున్నావు?" అని అడిగింది.

"త్వరగా వచ్చేశావే"

"ఇవాళ శుక్రవారం గదమ్మా. కాస్త పని త్వరగా తెముల్చుకుని వచ్చేశా"

"త్వరగా వచ్చావుగా నన్ను కాస్త బయటకు తీసుకు వెళ్లరాదూ?"

బూట్లు విప్పబోతున్న శిల్ప ఆగిపోయి నవ్వి "ఏమిటి బోరుకొడుతోందా?" అంది. "రేపు ఎల్లుండి శలవులేగా. రేపు కాస్కోకి వెళ్లి సామాన్లు తెచ్చుకుందాం. అట్నుంచి అటే ఇండియన్ రెస్టారెంటుకి వెళ్లి భోజనం చేద్దాం"

"అబ్బే అది కాదే. లేసు అల్లి అల్లి కళ్లు లాగుతున్నాయి. నడుము కూడా పట్టేస్తోంది. కాస్త అలా బయట తిరిగితే హాయిగా ఉంటుంది గదా!"

శిల్ప బూట్లు విప్పుకుంటూ మాట్లాడలేదు.

"ఇక్కడిక్కడే దగ్గర్లో రెండు రోడ్లు చూపించు చాలు. రోజూ కాసేపు అలా తిరిగి వస్తాను" అంది పట్టుదలగా.

"నీకే రోడ్లు తెలియవమ్మా. హాయిగా ఇంట్లో ఉండరాదూ! బోర్ కొట్టినప్పుడు టీవీ చూడు"

"రెండే రెండు చూపించవే చాలు" అంది మళ్లీ సావిత్రమ్మ.

"సరేలే అలాగే. కానీ జాగ్రత్తగా వెళ్లి, తిరిగి రాగలవో లేదో" అంది శిల్ప సంశయంగా.

"నేనేమన్నా చిన్న పిల్లనా? గుర్తులు పెట్టుకుంటాలే. నువ్వు ఏ రోడ్డు చూపిస్తే ఆ రోడ్‌నే నడచి, తిరిగి వచ్చేస్తా. ఇంకెక్కడికీ వెళ్లను"

శిల్ప ఒక్క క్షణం ఆలోచించి "సరే, రేపో ఎల్లుండో తీసుకువెడతాలే" అంది.

"రేపో ఎల్లుండా. ఎందుకు? ఇప్పుడు తీసుకువెళ్లరాదూ. త్వరగా వచ్చావుగా"

"పన్లు ఉన్నాయమ్మా"

"నీకు పనులు లేనిదెప్పుడు? మళ్లీ జిమ్‌కు వెళ్లాలంటావు. ఇంకెక్కడికో వెళ్లాలంటావు. అయినా ఇక్కడిక్కడ తిరగడానికి ఎంతసేపు పడుతుంది?"

తల్లి మొండితనం గమనించిన శిల్ప ఇక తప్పదనుకుని "సరే పద" అంది తిరిగి బూట్లు వేసుకుంటూ.

సావిత్రమ్మ బోలెడంత సంబరపడిపోయింది. కొప్పున పిన్నీసులు సరిచేసుకుంది.

శిల్ప తల్లికి బూట్లు ఇచ్చింది వేసుకోమని.

"నాకు అలవాటు లేదే. బరువుగా ఉంటాయేమో. నడవడానికి వస్తుందో రాదో."

"వాకింగ్‌కు వెళ్లేటప్పుడు బూట్లు లేకుండా కుదరదు. అలా అయితే బయలుదేరు. లేకపోతే లేదు"

ఇక తప్పనిసరై వేసుకుంది సావిత్రమ్మ. చలిగా ఉందంటూ కూతురిచ్చిన కోటు కూడా వేసుకుంది.

ముందు ద్వారం తలుపు తీసుకుని బయటకు



వచ్చారు తల్లీకూతుళ్లిద్దరూ. అక్కడికి వచ్చాక ఆ మెయిన్ డోర్ నుండి కాలు పెట్టడం అదే మొదటిసారి. ఎప్పుడు బయటకు వెళ్లినా పక్క తలుపు గుండా గ్యారేజ్‌లోకి వెళ్లడం, అక్కడే కారు ఎక్కడం, దిగడం. అట్నుంచే లోపలకు వెళ్లడం.

సావిత్రమ్మకు పరమానందంగా ఉంది. బూట్లు వేసుకుని నడవడం కొంచెం ఇబ్బందిగా ఉంది. అడుగులు బరువుగా, నెమ్మదిగా పడుతున్నాయి.

ఇంటి దగ్గర ఫుట్‌పాత్ మీద అలా పది అడుగులు వేయగానే శిల్ప అన్నది. "ఇదిగో ఈ పోస్ట్‌బాక్స్ గుర్తు పెట్టుకుని ముందుకు సరాసరి వెళ్లు. ఇక్కడ పోస్ట్ బాక్స్‌లన్నీ మెటల్ రంగులో ఉంటాయి. ఇది చిన్న బాక్స్. బాగా గుర్తు పెట్టుకో"

మలుపులో ఎత్తుగా ఉన్న ఆ బాక్స్ వైపు ఒక్క క్షణం చూసి "సరే" అంది సావిత్రమ్మ.

"మనింటి నుండి ఆరో ఇంటి దగ్గర ఉంది ఈ బాక్స్. మర్చిపోకు"

సరేనంటూ తలూపింది సావిత్రమ్మ. కూతురితో కలిసి అలా నడవడం చాలా గర్వంగా ఉంది. శిల్ప అన్ని గుర్తులూ చెబుతూ కొంచెం ముందుకు తీసుకు వెళ్లింది. "ఇక్కడ కుడివైపు తిరుగు. అంతే" అంటూ ఇంకొంచెం ముందుకు తీసుకెళ్లి అక్కడ ఆగిపోయింది. అక్కడో క్రాసింగ్ ఉంది. అక్కడే కుడిపక్కగా పెద్ద పోస్టు బాక్స్ ఉంది. "ఇక్కడ క్రాసింగ్స్‌లో ఎవరైనా రోడ్డు దాటుతూంటే వాళ్లు వెళ్లేదాకా కారు ముందుకు రాదు. అందువల్ల నడిచే వాళ్లకి ఇక్కడ భయం ఉండదు. అయినా నువ్వు ఈ క్రాసింగ్ దాటి ముందుకు వెళ్లకు. ఇదిగో ఈ పోస్ట్ బాక్స్ గుర్తు పెట్టుకో. ఇది పెద్ద బాక్స్. మనింటి దగ్గరున్న పోస్ట్‌బాక్స్ నుండి ఈ పోస్ట్ బాక్స్ వరకు నడువు" అంటూ శిల్ప వెనక్కి తిరిగింది. "ఇక వెళ్దాం" అంటూ "అదిగో ఆ పార్కుని కూడా గుర్తు పెట్టుకో" అంది కొంచెం దూరంలో ఉన్న పార్కు చూపిస్తూ.

సావిత్రమ్మకు ఇంకా నడవాలని ఉంది. ఆ పార్క్ వరకు వెడితే బావుండును. అక్కడ ఇద్దరు ముగ్గురు పిల్లలు ఆడుకుంటున్నారు.

ఆ మాటే అన్నది శిల్పతో "వద్దమ్మా. నీకసలే కొత్త. దూరం వెడితే మళ్లీ తిరిగి రాగలవో లేదో" అంటూ శిల్ప ముందుకు నడిచింది.

సావిత్రమ్మ నవ్వుకుంది. "నేనేం చిన్న పిల్లనా? ఈ మాత్రం గుర్తు పెట్టుకోలేనూ?" అయినా మళ్లీ అడిగే ధైర్యం లేక కూతురితో పాటు వెనుదిరిగింది.

తిరిగి వచ్చేసరికి ప్రభాకర్ కారు గ్యారేజీ లోపలకు వెడుతోంది. కారులో ఉండే గ్యారేజ్ తలుపు తెరుస్తారు, మూస్తారు. అదెలాగో అర్థం కాదు సావిత్రమ్మకు. గ్యారేజిలో ఉన్న తలుపు గుండా లోపలకు వెళ్లబోయే ముందు బూట్లు విప్పింది.

ప్రభాకర్, సావిత్రమ్మను చూస్తూ నవ్వుతూ "ఏమిటి అత్తయ్యగార్ని షికారుకి తీసుకెళ్లావా?" అన్నాడు శిల్పతో.

"అమ్మ రోజూ వాకింగ్ చేస్తుందట. అలా కొంచెం దూరం తీసుకెళ్లి రోడ్ చూపించి వస్తున్నాను"

"గుడ్ గుడ్. కానీ జాగ్రత్తండి అత్తయ్యగారూ. అటు ఇటు వెళ్లకండి. మళ్లీ తప్పిపోతే కష్టం"

'చిన్న చిన్న పిల్లలు సైకిళ్లు తొక్కుతూ బర్రున అటు ఇటు తిరుగుతూంటే ఇక్కడిక్కడ తిరుగుతూ పెద్ద దాన్ని నేను తప్పిపోవడమేమిటి? వీళ్లకి భయం, చాదస్తం ఎక్కువ' మనసులోనే నవ్వుకుంది.

మర్నాడు శనివారం. ఇద్దరూ ఇంట్లోనే ఉన్నారు. ఆలస్యంగా నిద్ర లేవడం, వంటలు చేసుకోవడంతోనే

మూడు దాటింది. అయినా కూతురితో అంది "అలా కాసేపు తిరిగివద్దామా శిల్పా?" అని.

"ఇవాళ వద్దులే అమ్మా. బయట పన్లు చాలా ఉన్నాయి" అంది శిల్ప మరో మాటకు అవకాశం ఇవ్వకుండా.

ఆ రాత్రి హిందీ సినిమా క్యాసెట్ పెట్టుకుని మర్నాడు పన్నెండు దాటాక లేచారు. ఆపైన ఫోన్ కాల్స్, ఫోన్లో ఫ్రెండ్స్‌తో ముచ్చట్లు. ఆ మధ్యాహ్నం గుజరాతీ ఫ్రెండ్సట భార్యాభర్తలు ఇద్దరూ వచ్చారు. నలుగురూ డ్రాయింగ్ రూంలో కూచుని హిందీ, ఇంగ్లీషులో మాట్లాడుకుంటూ నవ్వులే నవ్వులు సాయంత్రం చీకటి పడేదాక. వాళ్లందరూ అలా కబుర్లు చెప్పుకుంటూంటే సావిత్రమ్మకు బానే ఉంది. కానీ వాళ్లకి తెలుగు అస్సలు రాకపోవడమే నచ్చలేదు.

సోమవారం శిల్ప ఆఫీసుకు బయలుదేరుతూంటే సావిత్రమ్మ అడిగింది. "శిల్పా ఇవాళ మధ్యాహ్నం అలా కొంచెం తిరిగి రానా?"

"వద్దమ్మా. నేను రెండు మూడుసార్లు చూపిస్తాను. అప్పుడు ఒక్కదానివీ వెడుదువుగానీ."

"నాకేం భయం లేదు శిల్పా. కొంచెం దూరమేగా వెళ్లొస్తా"

"జాగ్రత్తగా వెళ్లి రాగలవా అమ్మా. రోడ్ గుర్తుందా?"

సావిత్రమ్మ నవ్వింది. "ఏముందే సరాసరి వెళ్లి, ఆ తర్వాత కుడివైపు మళ్లి పెద్ద పోస్ట్‌బాక్స్ దాకా వెళ్లి తిరిగి రావడమేగా"

"సరే అయితే జాగ్రత్త" ఇంటితాళం చెవి ఇచ్చి, తాళం ఎలా వెయ్యాలో నేర్పించింది. స్లిప్‌మీద ఇంటి అడ్రసు రాసి ఇచ్చింది. ఇంటి నెంబరు రెండుసార్లు సావిత్రమ్మ చేత చెప్పించింది.

తాళం చెవి, అడ్రసు కాగితం పర్సులో పెట్టుకుంది సావిత్రమ్మ.

"కొంచెం ఎండ వచ్చాక అప్పుడు వెళ్లు. సాక్సు, బూట్సు వేసుకో" చెప్పింది శిల్ప వెళుతూ.

ఆ రోజు సావిత్రమ్మకు చాలా హుషారుగా ఉంది. శుభ్రంగా తల దువ్వుకుని ముడిలో పిన్నులు గట్టిగా గుచ్చుకుంది. ముఖాన కుంకుమ బొట్టు చక్కగా తీర్చి దిద్దుకుంది.

కిటికీలో నుండి బయటకు చూసింది. ఎండ బాగానే కాస్తోంది. నడివయసు అమెరికన్ జంట వాకింగ్ చేస్తూ వెళ్లడం కనిపించింది. ఇక తను కూడా వాకింగ్‌కి బయలుదేరితే మంచిదని కోటు వేసుకుని సాక్సు, బూట్లు వేసుకుంది. ముందు తలుపు తీసుకుని జాగ్రత్తగా తాళం వేసి ఒకటికి రెండుసార్లు లాగి చూసింది. తాళం చెవి పర్సులో పెట్టుకుని, పర్సు కోటు జేబులో పెట్టుకునే ముందు ఇంటి అడ్రసు రాసి ఉన్న పసుపురంగు స్లిప్ ఉందో లేదో మళ్లీ ఒకసారి చెక్ చేసుకుంది.

ఫుట్‌పాత్ మీద అడుగుపెట్టబోతుండగా గబగబా నడుస్తూ ముందుకు వెళ్లిందో అమెరికన్ అమ్మాయి సావిత్రమ్మను చూసి 'హాయ్' చెబుతూ. 'నేనెవరో తెలియకపోయినా ఎంత చక్కగా పలుకరించి వెళ్లింది. ఎంత మంచి అమ్మాయి? పిల్ల కూడా ఎంత బావుంది? సన్నగా, తెల్లగా, నాజుగ్గా ఉంది' ఆ అమ్మాయినే చూస్తూ, ఆ అమ్మాయి వెనుకే నడవడం మొదలుపెట్టింది.

అటుఇటు ఉన్న ఇళ్లని చూసుకుంటూ వచ్చేపోయే కార్లని చూస్తూ, అలా ముందుకు నడుస్తోంది. ఏ స్కూటరో, సైకిలో డాష్ కొడుతుందన్న భయం లేదు. ఏ గుంతలోనైనా పడతామన్న కంగారు లేదు. అటు ఇటు గుబురుగా ఉన్న చెట్ల మధ్య నున్నగా ఉన్న పేవ్‌మెంటు మీద ఎంత దూరమైనా హాయిగా నడవొచ్చు. హుషారుగా అడుగులు ముందుకు పడుతున్నాయి. బూట్లతో నడవడం ఇప్పుడు ఆమెకు బాగుంది.

'ఎక్కడ చూసినా పచ్చపచ్చగా పెద్ద పెద్ద చెట్లు. చల్లటిగాలి, శిల్పను మంచిచోటే ఇచ్చాం. పొన్నూరులో ఏముంది? ఇక్కడ ఎంత ప్రశాంతంగా ఉంది? జనమే ఉండరు. కార్లు ఎన్ని వెడుతున్నా, వస్తున్నా హారన్ మోతే ఉండదు' ఆకాశంలోకి చూసింది. కొత్తగా ఉంది. ఆకాశంలో తెల్లగా రెండు నిలువు గీతలు, అడ్డ గీతలు- 'అబ్బో ఇదేదో తమాషాగా ఉందే. పొన్నూరులో ఎప్పుడూ చూడలేదు ఇలా'

నెమ్మదిగా నడుస్తూ గుర్తుపెట్టుకుని కుడివైపు తిరిగింది. 'సరాసరి నడచి ఒక మలుపు తిరగాలి. ఆ తర్వాత మళ్లీ సరాసరి నడచి తిరిగి వెనక్కి తిరగాలి. ఇదేం కష్టం. పిచ్చిపిల్లలు. ఇంతమాత్రందానికి వంద సార్లు జాగ్రత్త, జాగ్రత్త అన్నారు'



కుక్కలతో, పిల్లలని పెరోమిలేటర్లో పెట్టుకుని నడిచేవాళ్లని ఇన్నాళ్లూ దూరంగా పై నుండి చూసింది. ఇప్పుడు దగ్గర్నుండి చూస్తూంటే ఆమెకు చాలా ఆనందంగా ఉంది. వాళ్లవైపు అలా చూస్తూ ఉంటే వాళ్లు నవ్వుతూ, 'హాయ్' అంటూ వెళ్లిపోతున్నారు. 'ఇక్కడి వాళ్లకి ఎంత మర్యాదో?'

కాకుల కావు కావు వినిపించగానే, ఈ ఊళ్లో కాకులు ఉన్నాయా? ఇంతవరకు చూడనే లేదు. అవీ తెల్లగా ఉంటాయేమో? ఇక్కడ అందరూ తెల్లగా ఉంటారుగా! అటువైపు చూసింది. ఆ ప్రక్కగా ఉన్న గడ్డిమీద కనిపించాయి. 'అయ్యో ఇవి నల్లగా ఉన్నాయే, కానీ బొద్దుగా ముద్దొస్తున్నాయి సుమా!' వాటిని అలాగే కాసేపు చూసి ముందుకు నడిచి ఆ ఇంటి ముందు ఆగిపోయింది. గులాబీ చెట్లు, ఎర్రగులాబీలు, తెల్లగులాబీలు చెట్లనిండా విరబూశాయి. మరో

## తెలుగంటే ఇష్టం

**దేవదాసు, పోకిరీ చిత్రాల తర్వాత ఇలియానా ఇమేజ్ ఆకాశానికి పెరిగిపోయిందంటున్నారు. ఈ చిత్రంలో అవసరమైనమేరకు అందాల్ని ఆరబోసిన ఈభామ ఇప్పుడు ఎన్టీఆర్, ప్రభాస్, రవితేజలతో కలిసి నటిస్తోంది. 'ఇంత తక్కువటైంలో తెలుగు ప్రేక్షకులు మంచి ఆదరణ చూపడం నా అదృష్టం. ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నాను. త్వరలో అందరితో తెలుగులో మాట్లాడగలను' అని ఆనందంగా చెబుతోంది ఇలియానా. అవకాశాల వెల్లువ వల్ల బిజీగా ఉన్న ఈ భామ తమిళంలో డబ్బింగ్ చేస్తున్న పోకిరీలో విజయ్‌తో నటించడంలేదు.**


వైపు దానిమ్మ చెట్టు, చెట్టు నిండా కాయలే. చాలా పెద్దగా ఉన్నాయా దానిమ్మలు. ఎర్రగా మరో వైపు రామాఫలంలాగా ఉన్న కాయల చెట్టు. లేత పసుపు రంగులో దిగకాసి ఉబ్బాయి. ఆశ్చర్యంగా అలా చూస్తూ నిలబడిపోయింది. చెట్ల నిండా ఇన్ని పువ్వులు, కాయలు ఉన్నా ఎవ్వరూ కొయ్యరా! చుట్టూ ప్రహరీగోడ కూడా లేదు. ఎంచక్కా చేతికి అందుతాయి. మా పొన్నూరులో ఇలా ఉండనిస్తారూ? ప్రహరీగోడ దూకి మరీ జామకాయలు కోసుకుపోతారు పోకిరీ వెధవలు. పిందెలు కూడా ఉండనివ్వరు. పండగొస్తే చెప్పా పెట్టకుండా మామిడికొమ్మలు విరుచుకుపోతారు. ఎవర్నీ ఏమీ అనడానికి లేదు. అందరూ అయినవాళ్లే. అసలు ఇక్కడ దొంగ భయమే లేనట్లుంది. ఎంత బాగుందో? అబ్బాయికి కూడా చెప్పాలి ఈ ఊరు వచ్చేయమని' అప్పుడు హఠాత్తుగా స్ఫురణకు వచ్చింది సావిత్రమ్మకు మొన్న శిల్పతో వచ్చినపుడు ఈ పళ్లచెట్లు, గులాబీలు చూడలేదని. 'మాటల్లో పడి చూసుకుని ఉండం' అనుకుంటూ ముందుకు నడిచింది. 'ఈ సరాసరి నడిస్తే ఆ చివర్లో ఉంటుంది పోస్ట్‌బాక్స్. పోస్ట్‌బాక్స్ బాగా గుర్తే. పెద్దది. అక్కడిదాకా వెళ్లి తిరిగి వెనక్కి నడిస్తే సరి.' ఆ చివరదాకా నడిచింది. కానీ అక్కడ పోస్ట్‌బాక్స్ లేదు. ముందుకు చూసింది. దూరంగా పెద్ద పోస్ట్‌బాక్స్ కనిపించింది. కానీ రోడ్ దాటాలి. మొన్న రోడ్ దాటలేదే. రోడ్ దాటవద్దని చెప్పిందిగా. మరి పోస్ట్‌బాక్స్ కనిపిస్తోంది కుడిపక్కగా. మొన్న కూడా పోస్ట్‌బాక్స్ కుడి పక్కనే ఉంది. రోడ్ ఖాళీగా ఉంది. ఏ కారూ రావడం లేదు' అటుఇటు చూసి గబగబ రోడ్ దాటింది సావిత్రమ్మ. పోస్ట్‌బాక్స్ దగ్గరకు చేరుకుంది. 'అమ్మయ్య అనవసరంగా ఎంత కంగారు పడింది?' శిల్ప చెప్పిందిగా పోస్ట్‌వాళ్లు వ్యాన్‌లో వచ్చి, అందులోని అరల్లో ఎవరి ఉత్తరాలు వాళ్లదాన్లో వేస్తారుట. వీళ్లు వాళ్లకి కుదిరినపుడు వెళ్లి వాళ్ల అర తాళం తీసుకుని అందులోని ఉత్తరాలు తెచ్చుకుంటారుట. చాలా బావుంది ఈ ఉపాయం'

అక్కడే నిలబడి పార్కు ఎక్కడుందా అని చూసింది. కానీ అది కనిపించలేదు. తాను దోవ తప్పలేదు కదా! దూరం వచ్చేశానా! వెనక్కి తిరిగి చూసింది. 'వచ్చిన దోవనే వెనక్కి నడిస్తే సరి' స్పీడు పెంచింది. చేతితో కోటు జేబుని తడిమి చూసుకుంది పర్సు ఉందో లేదోనని.

రోడ్ దాటడానికి పేవ్‌మెంట్ చివరికి వచ్చి నిలబడింది. అంతలోనే ఎడమవైపుగా కారు వచ్చి ఆగిపోయింది. ఆ కారు వైపు చూసింది సావిత్రమ్మ. డ్రైవింగ్ సీట్లో ఉన్నాయన వెళ్లమన్నట్లుగా తలూపాడు. ఆ కారు వెనుక మరో కారు వచ్చి ఆగింది. కుడివైపు ఇంకో కారు ఆగిపోయింది. సావిత్రమ్మ రోడ్ దాటబోతుండగా సావిత్రమ్మ కంగారుగా వెనక్కి వచ్చేసింది. గుండె దడదడలాడుతుంటే, రోడ్ దాటకుండానే ఎడమవైపుకి తిరిగింది. 'పర్సులో నుండి అడ్రసు కాగితం బయటకు తీసి, ఇంటి నెంబర్లు చూసుకుంటూ నడవడం మొదలుపెట్టింది. ఆమెకు చెమటలు పడుతున్నాయి. రోడ్ మీద నడిచే వాళ్లు ఇద్దరు, ముగ్గురు ఎదురుపడ్డారు. వాళ్లని ఆపాలని చూసింది, చేతిలో అడ్రసు పేపరు పట్టుకుని. కానీ ఎవరూ ఆగలేదు. అందరికీ హడావిడే ఏమిటో మరి.

అప్పుడే ఆమె నడుస్తూన్న వైపే పక్కగా కారు ఆగింది. ఛామనచాయగా ఉన్నాడు. నల్లటి జుట్టు. 'మా వైపు అబ్బాయిలాగే ఉన్నాడు.' సావిత్రమ్మ సంబరపడింది. అడ్రసు చెబితే తప్పక ఇంటి దగ్గర దిగబెడతాడు. లేకపోతే ఎటు వెళ్లాలో చెబుతాడు. కారు దగ్గరకు నడిచింది. అతను సెల్‌లో మాట్లాడుతున్నాడు ఇంగ్లీషులో. మాట్లాడుతూ మాట్లాడుతూ సావిత్రమ్మ వైపు చూశాడు. అతను సెల్‌లో మాట్లాడడం ఎప్పుడు పూర్తి చేస్తాడా? అని అలా చూస్తూ నిలబడిపోయింది. ఆమె అలా చూస్తూ ఉండగానే సెల్ డాషింగ్ బోర్డులో పెట్టేసి కారు స్టార్టు చేసుకుని బర్రున వెళ్లిపోయాడు. సావిత్రమ్మకు ఒళ్లు మండింది. 'ఇంతసేపు నిలబడితే కనీసం ఏంటమ్మా అనైనా అడగలేదు.'

అంతలో ఒకతను జాగింగ్ చేసుకుంటూ వస్తుండడం కనబడింది. ధైర్యం చేసి అతనికి ఎదురు వెళ్లింది సావిత్రమ్మ 'బాబూ, బాబూ' అంటూ. అతను ఆగాడు. కాగితం చూశాడు. చెయ్యి అటు ఇటు తిప్పి చూపించి రయ్‌మని వెళ్లిపోయాడు. అతను చెప్పిందేమిటో అసలు అర్థం కాలేదు. సావిత్రమ్మకు కళ్లంట



## విజయం సొంతం

**మం**చి టాలెంట్, ప్రేక్షకాభిమానం ఉంటే ఎన్ని చిత్రాల్లోనైనా నటించవచ్చని నిరూపించారు నాగార్జున. తండ్రి నాగేశ్వరరావు బ్యాక్‌గ్రౌండ్‌ని తానేమీ ఉపయోగించుకోలేదని చెప్పే నాగార్జున తాను నటించే భక్తిరస ప్రధానమైన చిత్రాలు సూపర్ హిట్ కావడానికి కారణం దర్శకులు, మంచికథే అంటున్నారు. ఈమధ్య జరిగిన అభినందనసభలో నాగార్జునని 'కాళిదాసు'గా చూడాలని ఉందంటే ఆయన చిత్రాలకి కథని సమకూర్చే భారవి 'రామకృష్ణ పరమహంస' పాత్ర చేయమని అడిగారు. ఏపాత్ర అయినా అందులో ఇన్‌వాల్వ్ అయితే ఎంతటి విజయమైనా మన సొంతం అవుతుందంటున్నారు నాగ్.

నీళ్లు తిరిగాయి. 'ఒక్క వెధవా సరిగా చెప్పడే. కొంచెం ఇల్లు చూపించవచ్చు కదా! పొన్నూరులో అయితే ఇలా ఉంటుందా? ఇంటికి తీసుకెళ్లి దిగబెడతారు. కష్టం, సుఖం అడుగుతారు. ఏదన్నా కష్టం వస్తే అందరూ వచ్చి పలకరిస్తారు. సాయం చేస్తారు. ఈ దరిద్రపు ఊరులో జనమే కనబడరు. ఛీ పాడు ఊరు, పాడు గోల' సావిత్రమ్మ అలా తిరుగుతూనే ఉంది రోడ్ పక్కగా అక్కడక్కడా ఉన్న రోడ్ నెంబరు ఉన్న ప్లేటు చూసుకుంటూ.

పైన ఆకాశంలో మబ్బులు కమ్ముతున్నాయి. గాలి వీస్తోంది. ఎదురుగా రోడ్ మలుపులో రోడ్ నెంబరు ఉన్న ప్లేటు కనిపించింది. అటు నడిచింది. అడ్రస్ పేపర్ తీసి రోడ్ నెంబరు ఒకటో కాదో చూసుకుంటు న్నంతలోనే బలంగా వీచిన గాలికి ఆ స్లిప్ ఎగిరిపో యింది సావిత్రమ్మ చేతిలో నుండి. పట్టుకోబోయేం తలో ముడిలోని పిన్ను జారిపడింది. ముడి కిందకు జారింది. అందుబాటులో ఉన్న పిన్నును వంగి కిందకు తీసుకునే శక్తి లేనట్లు అలా నిలబడిపో యింది. గాలికి చీరకుచ్చెళ్లు రెపరెపమంటున్నాయి. కళ్లంట నీళ్లు టపటప రాలి పడుతున్నాయి. ఈ దిక్కు మాలిన ఊరులో వాకింగ్‌కు బయలుదేరడం బుద్ధి తక్కువ పని. ఇక్కడ మనిషి కింద పడినా లేవదీసే దిక్కు లేదు.

అమ్మాయి ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు తీసుకువె డుతుందో. ఈ దిక్కుమాలిన ఊళ్లో అన్ని ఇళ్లు ఒక్క లాగే ఉంటాయి. చెక్కమొహాలకి చెక్క ఇళ్లు. ఒక్కళ్లు కూడా బయట కనిపించరు. ఒక్క వాకిలీ తీసి ఉండరు. ఇదేం ఖర్మో. ప్రొద్దస్తమానం తలుపులు వేసుకుని భయం భయంగా బ్రతుకుతారు. అమ్మాయి, అల్లుడు జాగ్రత్త, జాగ్రత్త అని పలుమార్లు చెప్పారు. ఏమంటారో...

సావిత్రమ్మకు కాళ్లు నొప్పులు పడుతున్నాయి. ఇహ నడవలేక అక్కడే ఉన్న ఫెన్సింగ్‌కు ఆనుకుని నిలబడి పోయింది. చినుకులు పడుతున్నాయి.

అప్పుడు వినిపించింది 'అమ్మా' అన్న పిలుపు అమృతంలాగా. అటు చూసింది. కారులో శిల్ప. కారు రోడ్ పక్కగా ఆగి ఉంది. ప్రాణం వచ్చిన బొమ్మలా చటుక్కున లేచి కారు దగ్గరకు నడచి, డోరు తీసుకుని లోపల కూచుంది సావి త్రమ్మ.

"సీటు బెల్ట్ పెట్టు"

బెల్ట్ పెట్టుకోడానికి రాలేదు. శిల్ప పెట్టింది. సావిత్రమ్మకు ఇంకా అయోమ యంగానే ఉంది. మాట్లాడకుండా కూచుంది. ఇంటికొచ్చాక గ్యారేజ్ క్లోజ్ చేసిన తర్వాత శిల్ప హుంకరించింది "ఇక దిగు" అంటూ.

సీటు బెల్ట్ తీసుకోడానికి రాలేదు. శిల్ప డోర్ తీస్తూ "ఇన్ని రోజులైంది వచ్చి ఇప్ప టికీ సీటు బెల్ట్ ఎలా పెట్టుకోవాలో, ఎలా తీసుకోవాలో రాదు. ఇప్పటికి డజనుసార్లు చెప్పి ఉంటాను. అలాంటి నీకు షికారుకెళ్లాలని సరదా. నా ప్రాణం తీశావ్"

"అది కాదే కరెక్ట్‌గా నువ్వు చెప్పినట్లే వెళ్లాను. నువ్వు చూపించిన దోవలోనే నడిచాను. పెద్ద పోస్టుబాక్స్ దాకా వెళ్లాను. కానీ పార్కే కనిపించలేదు" అంది.

"చాలు. ఈ కమ్యూనిటీ దాటి వెళ్లిపోయావు. అసలు అటు ఎందుకు వెళ్లావ్?"

"కాదే. నువ్వు చెప్పిన దోవలోనే వెళ్లాను"

"ఎటు?"

కిటికీలో నుండి చూపించింది. "ఇదిగో ఇటు" అంటూ.

శిల్ప మండిపడింది. గట్టిగా అరచింది. "మనం ఇటు వైపు వెళ్లామా? అటు పక్కనున్న చిన్న పోస్ట్ బాక్స్‌ని గుర్తు పెట్టుకోమని చెప్పలేదూ? ఆ పక్క నుండి కదూ నిన్ను తీసుకు వెళ్లింది. గుమ్మంలోనే పొరపాటు చేశావు. ఈసారి వాకింగ్ అను. బూట్లు ఇటివ్వు. మళ్లీ ముట్టుకోకు వీటిని." అంటూ బూట్లని తీసి క్లోజెట్‌లోకి నెట్టేసింది.

"మూడు గంటల నుండి ఫోన్ చేస్తూంటే ఎత్తడం లేదు. అనుమానం వచ్చి ఆఫీసులో పనులన్నీ వదులు కుని పరుగెత్తుకు వచ్చాను. అరగంట టెన్షన్ పెట్టావ్. నేను రావడం ఇంకా ఆలస్యమై ఉంటే నీ గతి ఏమై ఉండేది."

సావిత్రమ్మకు కాఫీ కలిపి ఇచ్చింది శిల్ప. అయినా సావిత్రమ్మకు గుండె దడ తగ్గలేదు. శిల్ప పెట్టే చివాట్లు వింటూ అలా కూచుండిపోయింది.

ప్రభాకర్ వచ్చాక విషయమంతా చెప్పింది శిల్ప.

"అదికాదు అత్తయ్యగారూ, అడ్రసు రాసిన పేపరు చూపించి ఉంటే ఎవరైనా చెప్పి ఉండేవారు"

"ఆ పేపరు గాలికి ఎగిరిపోయింది"

ప్రభాకర్ ఏం మాట్లాడలేదు. శిల్ప మరింత మండిప డింది. "నేను రాకపోయి ఉన్నట్లయితే నీ ప్రాణాలు ఎగిరి పోయి ఉండేవి. వర్షానికి, చలికి గడ్డకట్టుకు పోయి ఉండేదానివి. అప్పటికే శోష వచ్చిన దాన్లా అయ్యావు. మూడుసార్లు పిలిస్తేగానీ నీకు వినిపించ లేదు"

"ఇంకెప్పుడూ బయటకు వెళ్లకండి అత్తయ్య గారూ! మీకు అలవాటు లేదు" అన్నాడు ప్రభాకర్ మందలింపుగా.

సావిత్రమ్మకు చాలా దుఃఖం వచ్చింది. 'తనేమన్నా కావాలని తప్పిపోయిందా? అర్థం చేసుకోరేం. అప్పి కట్ల నుండి పొన్నూరు వచ్చి కాపురం చెయ్యలేదూ? హైదరాబాద్‌లో కొడుకు దగ్గర ఉండలేదూ? గుళ్లకి, గోపురాలకి తిరగలేదూ? ఈ ఊరే దరిద్రపు ఊరు. మాటా మంచి తెలియని వాళ్లు. బన్ను ముక్కలు, కోళ్లు, కొంగలు తప్ప. ఆవకాయ రుచి తెలియని వాళ్లు. గోంగూర మొహం ఎరుగని వెర్రివాళ్లు. పొన్నూ రులో ఎంత హాయిగా బ్రతకొచ్చు. అక్కడ అందరూ మనవాళ్లే'

ఆ రోజు నుండి సావిత్రమ్మకు రోజు గడవడం కష్టంగా ఉంటోంది. ముళ్ల మీద ఉన్నట్లుగా ఉంది. అన్నం తినబుద్ధి కావడం లేదు. లేసుల అల్లికలు మానేసింది. కిటికీ కర్టెన్లు వేసేసి, పడుకునే ఉంటోంది.

శిల్పని అడిగింది. "నన్ను పొన్నూరు పంపించు" అంటూ.

"ఇది గుంటూరు, పొన్నూరు కాదు నీ ఇష్టమైన పుడు వెళ్లడానికి. టికెట్ తారీఖు మార్చాలంటే మళ్లీ డబ్బులు కట్టాలి"

"నన్ను త్వరగా పంపించు. మనమడి మీద బెంగగా ఉంది" ఆ రోజు బాగా మొండికేసింది.

ప్రభాకర్ అన్నాడు. "సరేలెండి అత్తయ్యగారూ, మిమ్మల్ని క్షేమంగా పంపే ఏర్పాట్లు కూడా చెయ్యాలి గదా. కనుక్కుంటాను."

"నన్ను త్వరగా పంపించు బాబూ. నాకు అన్నం కూడా సహించడం లేదు."

ఆ రోజు సావిత్రమ్మకు చాలా ఆనందంగా ఉంది. హైదరాబాద్ వెళ్లిపోతోంది. కూతుర్ని, అల్లుడిని వదలి వెళ్లాలంటే బాధగా కూడా ఉంది.

"ఈ ఊళ్లో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఎందుకు బాబూ, ఇంత దూరంలో"

"దూరమేముంది అత్తయ్యగారూ! ఇరవై నాలుగు గంటల ప్రయాణం అంతే కదా"

"ఇక్కడ అలవాటు పడ్డామమ్మా" అంది శిల్ప.

"ఈసారి మీరు, మామయ్యగారు రండి"

'ఈ దిక్కుమాలిన ఊరికి మళ్లీ రావ డమా?' అనుకుంటూ భారమైన హృద యంతో కూతురి చెయ్యి వదలి, తన ఎస్కార్టు చెయ్యి పట్టుకుని ఎయిర్‌పోర్టు లోపలకు వెళ్లింది సావిత్రమ్మ.

